నేడు జాతీయ ఉర్దూ పురస్కారాలు

కడప అర్బన్ : కడపలో మెదటిసారి జాతీయ స్థాయిలో ఉర్దూ సాహిత్య వికాసానికి విశిష్ట సేవలు అందించిన15 మంది గొప్ప వ్యక్తులకు అమీరున్నిసా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని పెద్ద దర్గా దగ్గర ఉన్న పర్వీన్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు స్థాపకుడు అన్వర్ హాది జునైది తెలిపారు. 15 మంది అవార్డు గ్రహీతలకు మూడు విభాగాల్లో అవార్డులు, ఏడుగురికి మౌలాన అబుల్ కలాం ఆజాద్ అవార్డులు, ఆరుగురికి అల్లామ ఇక్బాల్ అవార్డులు, ఇద్దరికి జోగేంద్రపాల్ అవార్డులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డులు పొందేవారు ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒడిషా, తెలంగాణ, కర్నాటక, జార?ండ్ కలకత్తా రాష్ట్రల నుంచి ఉర్దూ కవులు, రచయితలు హాజరుకానున్నారని తెలిపారు. వీరిని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, మోమెంటోతో సత్కరించనున్నారు.

ఇళ్లకు 'జువారి' ఎఫెక్ట్

- బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు పగుళ్లు
- ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టని యాజమాన్యం

బ్లాస్టింగ్ కారణంగా నెర్రలు చీలిన ఇంటి గోడ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

దేశంలోనే సిమెంట్ రంగంలో ఎంతో పేరు గాంచిన సంస్థ జువారి సిమెంట్స్. నాణ్యత గల సిమెంట్‌కు పెట్టింది పేరుగా ప్రసిద్ధి. ఈ సిమెంట్ కర్మాగారం వల్ల వందల మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయనేది అందరికీ తెలిసిన సత్యం. కానీ అదే జువారి కర్మగారం పాదాల కింద పడి నలుగుతున్న గ్రామాలు కూడా ఉన్నాయన్నది అంతే సత్యం. కర్మాగారం చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు ఏదో ఒక సమస్యతో అల్లాడుతున్నారు. జువారి కర్మాగారం ఉన్న గ్రామాల్లోని భూగర్భంలో నాపరాయి నిక్షేపాలు అధికంగా ఉండడం ఆ గ్రామాల ప్రజలకు వరమో... శాపమో...అర్థంకాని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. ఆనాడు కర్మాగార నిర్మాణం కోసం ఎర్రగుంట్ల మండలంలోని వలసపల్లి, తుమ్మలపల్లి, కోడూరు, పెదనపాడు గ్రామాల ప్రజలు తమ భూములను త్యాగం చేశారు. ఇప్పుడు అదే కర్మాగారం వల్ల ప్రజలు నష్టపోతున్నారు. కర్మాగారంలో నాపరాయి తవ్వకాల కోసం చేస్తున్న బ్లాస్టింగ్ కారణంగా మండలంలోని వలసపల్లి గ్రామంలో పలు ఇళ్ల బీటలు వారి కూలిపోయే పరిస్థితులలో ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వలసపల్లి గ్రామానికి కూతవేటు దూరంలోనే జువారి మైనింగ్ చేపట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నారు. మైనింగ్‌లో నిర్వహించే భారీ పేలుళ్ల కారణంగా భూమి కంపిస్తోందని, దానివల్ల ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. రోజూ మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో నాపరాయి తవ్వకాల కోసం మందు గుండు సామాగ్రితో భారీ పేలుళ్లు సృష్టిస్తున్నారని, దాని కారణంగా లక్షలు విలువ చేసే ఇళ్లు శిథిలమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలు రూపాయి రూపాయి కూడా పెట్టి సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటుంటే, మైనింగ్ పుణ్యమా అంటూ కట్టుకున్న ఇళ్లు కూలిపోతుందో తెలియక బిక్కు బిక్కుమంటూ జీవించే పరిస్థితులలో ఉన్నామంటూ ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా 42 నుంచి 50 ఏళ్లు ఉండాల్సిన ఇళ్లు బ్లాస్టింగ్ కారణంగా 15 నుంచి 20 ఏళ్లకే శిథిలావస్థకు చేరుతున్నాయని పలువురు వాపోతున్నారు. బ్లాస్టింగ్ జరిగిన సమయంలో ఏర్పడే దుమ్ము గ్రామం మొత్తం వ్యాపిస్తోందని, దుమ్ముతో సహజీవనం చేస్తు న్నామని పేర్కొంటున్నారు. అధికారులకు, జువారి యాజ మాన్యానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని వెల్లడించారు. ఇలాగే కొనసాగితే గ్రామం వదిలి వెళ్లాల్సి ఒదేనని, వేరే గత్యంతరం లేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి జువారి యాజమాన్యం, అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బ్లాస్టింగ్ దెబ్బకు ఇంటి ప్రహరీకి ఏర్పడిన పగుళ్లు

నిలువ నీడ లేకుండా పోతోంది...

జువారి కర్మాగారం నాపరాయి కోసం చేస్తున్న బ్లాస్టింగ్ కారణంగా గ్రామంలోని ఇళ్లు చాలా వరకు శిథిలావస్థకు చేరు కున్నాయి. బ్లాస్టింగ్ సమయంలో భూమి మొత్తం ఒక్కసారిగా కంపిస్తోంది. ఒక్కోసారి ఇళ్లలోని వస్తువులు కూడా కింద పడతాయి. ఆశగా నిర్మించుకున్న ఇళ్లు కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుంటే బాధపడడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాం. బ్లాస్టింగ్ సమయంలో ఏర్పడే దుమ్ముతో ఒకవైపు పంట పొలాలు నాశనం అవుతుంటే మరోవైపు బ్లాస్టింగ్ కారణంగా కట్టుకున్న ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. గ్రామస్తులకు కళ్ళెదుటే నిలువు నీడ లేకుండా పోతోంది. జువారి యాజమాన్యం సమస్యపై స్పందించి న్యాయం చేయాలి.

- సుదర్శన్‌రెడ్డి, గ్రామస్తుడు, వలసపల్లి.

రేపు సిఎం జిల్లా పర్యటన ఖరారు

- ప్రారంభోత్సవాలతో బిజీగా గడపనున్న జగన్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

పులివెందులలో మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/రూరల్/కడప

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన ఖరారు అయింది. ఈనెల 11న పులివెందుల నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. 11న ఉదయం 9 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరి 10.20 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందుల భాక్రాపురం హెలిప్యాడ్‌కు చేరుకొని 10.55కు డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వానికి చేరుకుని ప్రారంభిస్తారు. తరువాత నల్లపరెడ్డిపల్లెలోని అరటి ప్యాక్ హౌస్‌ను, మినీ సచివాలయాన్ని ప్రారంభిస్తారు. తర్వాత 12.30 గంటలకు వైఎస్ఆర్ జంక్షన్‌ను , 12.35 కి సెంట్రల్ బోలె వార్డ్‌ను, జయమ్మ షాపింగ్ కాంప్లెక్స్‌ను, గాంధీ జంక్షన్‌ను, ఉలిమెల్ల సరస్సును, ఆదిత్య మొదటి యూనిట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం 2.35 గంటలకు ఇడుపులపాయకు చేరుకుని వైయస్సార్ మెమోరియల్ పార్కును ప్రారంభిస్తారు. తర్వాత అక్కడే ఉన్న గెస్ట్ హౌస్‌లో 3 గంల అక్కడే ఉన్న గెస్ట్ హౌస్ లో 3 గంటల నుంచి 4 వరకు విశ్రాంతి తీసుకుంటారు. తర్వాత కడప ఎయిర్ పోర్టుకు చేరుకుని గన్నవరానికి వెళ్తారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెడికల్ కళాశాల, జిజిహెచ్ లోని ఒపి, ఐపి, ఆపరేషన్ థియేటర్లు, ఎక్స్-రే, ఫార్మసీ బ్లాకులను, నర్సింగ్ కళాశాలను ,అరటి అంతర్జాతీయ ప్యాక్ హౌస్ తదితర ప్రాంతాలను కలెక్టర్ ఎస్పితో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు పక్కాగా ఉండాలని, తాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కడప ఎయిర్ పోర్టు, పులివెందుల హెలిప్యాడ్, పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల వద్ద ప్రోటోకాల్ మేరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బ ందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, డిప్యూటీ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, పులివె ందుల ఆర్‌డిఒ వెంకటేశం, వైద్య ఆరోగ్యశాఖ, ఎపిఎంఎస్ఐడిసి, విద్యుత్, ఆర్అండ్‌బి, పిఆర్ శాఖల ఇంజనీర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులుపాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

- యుటిఎఫ్ మహిళా సదస్సులో డిఇఒ ఎం.అనురాధ

డిఇఒను సన్మానిస్తున్న యుటిఎఫ్ మహిళా నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళా సాధికారితతోనే దేశాభివృద్ధి సాధ్యమ వుతుందని జిల్లా విద్యా శాఖాధికారి ఎం.అనురాధ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శంకరాపురంలోని స్కౌట్స్ హాలులో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాతరాణి అధ్యక్షతన మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన డిఇఒ మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాలలో రాణించడం శుభ పరిణామమన్నారు. మహిళాభివృద్ధి విద్య ద్వారా మాత్రమే సాధ్య మవుతుందని పేర్కొన్నారు. విద్యాపరంగా అభివృద్ధి సాధించిన దేశాల్లో, రాష్ట్రాల్లో మహిళలకు ప్రత్యేక స్థానముందన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా కొన్ని రంగాలలో స్త్రీలు అణిచివేతకు గురవుతున్నారన్నారు. ప్రత్యేకంగా రాజకీయ రంగంలో స్త్రీలపై నేటికీ వివక్ష కొనసాగుతుందని చెప్పారు. పురుషునితోపాటు అన్ని రంగాలలో స్త్రీలు సమానంగా రాణించినా ఆర్థిక సమానత్వాన్ని సాధించలేకపోతున్నారన్నారు. ఆర్థిక సమానత్వం సాధించకపోవడంతో మిగిలిన రంగాలలో కూడా నిరాధారణకు గురవుతున్నారని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి.ప్రమీల మాట్లాడుతూ ఆధునిక సమాజంలో కూడా స్త్రీల పట్ల వివక్ష, చిన్న చూపు తగదన్నారు. నేటికీ స్త్రీల పట్ల అఘాయిత్యాలు, లైంగిక దాడులు జరగడం సమాజానికి మాయని మచ్చ లాంటిదన్నారు. స్త్రీలు విద్య ద్వారా చైతన్యవంతులై తమ పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను, హింసను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. స్త్రీల అభివృద్ధి జరగకుండా సమాజాభివృద్ధి సాధించడం సాధ్యం కాదన్నారు. ఏ సమాజమైనా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే మహిళాభివృద్ధి ద్వారా మాత్రమే సాధ్యమని వారు అభిప్రాయపడ్డారు. స్త్రీలు తమ హక్కులతో పాటు, రక్షణ కోసం ఏర్పాటైన చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళాభ్యున్నతి కోసం ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాలలో, మహిళలు పనిచేసే సంస్థలలో పాలకులు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మహిళలు అబలలు కాదు సబలలు అనే రీతిలో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికా విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలన్నారు. మహిళల పట్ల చూపుతున్న వివక్షతకు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా యుటిఎఫ్ ఎప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. సదస్సు అనంతరం జిల్లా విద్యాశాఖాధికారితో పాటు పలువురు అధికారులకు, మహిళలకు సన్మానం చేపట్టి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జయనగర్ కాలనీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.భాగ్యవతి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.పర్వీన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరీ, నాయకులు ఏ.డి.దేవదత్తం, రమణమ్మ, శివకుమారి, వాణి పాల్గొన్నారు.

సిఎంకు దూదేకుల సంఘం కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

దూదేకుల పిల్లలకు టిసిలలో హిందూ దూదేకుల అని కాకుండా ముస్లిం దూదేకుల అని రాసి ఇవ్వాలని విద్యాశాఖకు ప్రభుత్వం సర్కులర్ ఇవ్వడం పట్ల సిఎం జగన్మోహన్ రెడ్డికి దూదేకుల సంఘం కృతజ్ఞతలు తెలియజేస్తుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా పేర్కొన్నారు. శనివారం ఎంబిసి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్స్ పిల్లల టిసిలలో హిందూ దూదేకుల అని స్కూల్ వారు రాసే వారని తెలిపారు. ఇలా రాయడం వల్ల ఉద్యోగ, రిజర్వేషన్ల విషయంలో చాలా నష్టం జరిగేదని చెప్పారు. ఇప్పుడు తమ వినతుల వల్ల డిప్యూటీ సిఎం అంజాద్ బాషా సహకారంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి టిసిలలోని ఇబ్బందులను తొలగిస్తూ ఒక సర్కులర్ ఇచ్చారని పేర్కొన్నారు. అనేక సంవత్సరాల నుంచి తాము ఎదుర్కొంటున్న సమస్యను తీర్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం అంజాద్ బాషాకు, ఎంపీ అవినాష్ రెడ్డికి రాష్ట్ర నూర్ బాష్ దూదేకుల సంఘం ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పగిడాలా పెద్దన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగూరు కుళాయిప్ప, మహబూబ్ బాషా, రెడ్డయ్య పాల్గొన్నారు.

యాత్రికులకు అల్పాహారం

ప్రజాశక్తి-చెన్నూరు

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పొలతల, నిత్య పూజ కోన, భైరవకోన, పుష్పగిరి, అల్లాడపల్లి దేవలాలు, వేయి నూతల కోన, జిల్లాలోని వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో యాత్రికుల కోసం మండల కేంద్రమైన చెన్నూరు కొత్త రోడ్డు వద్ద శనివారం ఉదయం కమిటీ నిర్వాహకులు అల్పాహారం అందించారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. గమ్యస్థానాలకు చేరే భక్తులు చెన్నూరు కొత్త రోడ్డు వద్ద తమ వాహనాలను ఆపి అల్పాహారంతో పాటు అన్నసంతర్పణ కమిటీ నిర్వాహకులు అందించారు. 15 సంవత్సరాలుగా కొత్త రోడ్డు వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకున్న యజమానులు ప్రతి సంవత్సరం శివరాత్రి మరుసటి రోజు తిరుగు ప్రయాణం భక్తులకు అన్నసంతర్పణ చేయడం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో స్వచ్ఛంద కమిటీ నిర్వాహకులు చికెన్ సెంటర్ శివ, మటన్ సెంటర్ రమణారెడ్డి, మెడికల్ స్టోర్ సుధాకర్ రెడ్డి, చెప్పులు షాపు కొండయ్య. కూల్ డ్రింక్స్ చీర్ల చైతన్య యాదవ్, నాగ శంకరయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీసులను శిక్షించాలి : ఆవాజ్

ప్రజాశక్తి - బద్వేలు

స్థానిక ఆవాజ్ కమిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆవాజ్ కమిటీ, కడప జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాష ,బద్వేల్ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ఎ సత్తార్ మాట్లాడుతూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇంద్రలోక్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ముస్లిం సోదరులు నమాజ్ (ప్రార్థన) చేసుకోవానికి వెళ్లగా మసీదు నిండిపోవడంతో బయట నమాజ్ చేస్తుంటే వారిపై అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ బూటు కాళ్లతో తన్ని భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ప్రజలకు ప్రాణ, మాన రక్షణగా ఉండాల్సిన ఎస్ఐ ఉన్మాదిలో అత్యంత నిరంకుశంగా దాడి చేయడం సభ్య సమాజానికి సిగ్గుచేటున్నారు. ఇలాంటి ఘటనలను భారతదేశ ప్రజలు,కులాలు మతాలు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ ఘటనకు పాల్పడిన ఎస్ఐని, పోలీసులనుకఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆవాజ్ నాయకులు ఖాజాగౌస్, రసూల్. రఫీ, జిలాని, మాబు, గౌస్ పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ

ప్రజాశక్తి-కాశినాయన

వచ్చే ఎన్నికలలో గ్రామాలలో ఎవరైనా సమస్యలు సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి గొడవలు చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్ఐ అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన నరసాపురంలో ప్రధాన సెంటర్‌లో గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రశాంతంగా ఎవరి ఓటు వారు ధైర్యంగా వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్టం తన పని చేసుకుంటుందని ప్రతి ఓటరు గుర్తుపెట్టుకోవాలి అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రచారానికి వచ్చినప్పుడు అల్లర్లు చేయకుండా ఏ ఒక్కరు ఇబ్బంది కలిగించకూడదని సూచించారు. మీకు నచ్చిన వారికి మీకు ఇష్టం వచ్చిన వారికి స్వచ్ఛందంగా ఓటు వేసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బిజెపికి తగిన బుద్ధి చెప్పాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మికులను యాచకులుగా మారుస్తున్న బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని, సంఘటిత పోరాటాలు చేసే సిఐటియు వైపు కార్మికులు నిలవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం కడప సిఐటియు జిల్లా కార్యాలయంలో బి.లక్ష్మీదేవితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. దేశంలో నేడు కార్మిక వర్గం విపత్కర పరిస్థితుల్లో ఉందని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మిక చట్టాలన్ని రద్దుచేసి, నాలుగు కోడ్స్ గా మార్చి కార్మికులను దేశంలో యాచకులుగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామి నాథన్‌కు భారత రత్న ఇచ్చి ఆయన సూచనలు మాత్రం పాతి పెట్టారని వాపోయారు.. రైతులను శత్రువులాగా చూస్తూ వారి పోరాటాన్ని అణచివేస్తున్నారని తెలిపారు. మైనార్టీలకు దేశంలో ఓటు లేకుండా ఎన్ఆర్‌సి, సిఎఎ నల్లచట్టాలను తీసుకు రావాడానికి ప్రయత్నించి ప్రతిపక్షాల పార్లమెంటరీ పోరాటాల ఎదురు దెబ్బతో తాత్కాలికంగా వెనకడుగు వేశారన్నారు. ప్రజలందరికీ తిండి, బట్ట, ఇల్లు, విద్య , వైద్యం గాలికి వదిలేసి భావోద్వేగా రాజకీయాలు వైపు ప్రజలను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కరోనా కన్నా కాషాయ వైరస్ ఎక్కువ ప్రమాదం అని గుర్తు చేశారు. దీనిని ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. సమావేవ:లో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, సిఐటియు జిల్లా కార్యదర్శులు కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, ఎన్.భైరవ ప్రసాద్, వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి , రామ్మోహన్, కార్మిక సంఘాల నాయకత్వం పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

కడప అర్బన్ : ఈ నెల 1న ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా, ఇప్పటి వరకు జిల్లాలో ఒకటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదయిందని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య, స్పెషల్ ఆఫీజర్ జి. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం సిసి కెమెరాల్లో పరీక్షలను పర్యవేక్షించారు. గతేడాది కంటే ఈ సారి పెరిగిన విద్యార్థుల సంఖ్య పెరగడంతో జిల్లాలో 69 కేంద్రాల్లో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న అధికారులు ఆదేశం అనుసారంగా విద్యార్థుల కేటాయింపు బెంచ్‌కు ఇద్దరు మాత్రమే ఉండేలా సీటింగ్ ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ కోర్సులకు కలిపి మ్యాస్ 1 బి, జువాలజీ, హిస్టరీ పేపర్ 14,758 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 14,152 మంది శనివారం పరీక్షలు రాశారన్నారు. 606 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని వెల్లడించారు.

కడప బస్ డిపో గ్యారేజ్ ప్రారంభం

కడప అర్బన్ : వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎంపీ అవినాష్‌రడెడ్డి, ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున రెడ్డి, మేయర్ కే సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్‌టిసి బస్సు డిపోలో గ్యారేజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఎపిఎస్ ఆర్‌టిసిని మరింత బలోపేతం చేసి అన్ని అంశాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు సౌకర్యవంతంగా ఆర్‌టిసి బస్టాండులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, ఎపిఎస్ఆర్‌టిసి ఈడి వెంకటేశ్వరరావు, ఆర్ఎం గోపాల్ రెడ్డి, డిఎం. డి.డిల్లేశ్వరరావు, స్థానిక నాయకులు నారపు రెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-చెన్నూరు

త్వరలో జరగనున్న పార్లమెంటు శాసనసభ ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా మండల కేంద్రమైన చెన్నూరు గ్రామంలో శనివారం ఉదయం కేంద్ర సాయుధ బలగాలు చెన్నూరు సిఐ పార్థసారథి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి తహశీల్దార్ కార్యాలయం, మెయిన్ రోడ్డు, బస్టాండ్, రెడ్డిగారివీధి, నాగలకట్ట వీధి, రామాలయం వీధి, అరుంధతి నగర్, కొత్త గాంధీనగర్ కొత్త రోడ్డు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో ఎటువంటి కక్షలకు తావు ఇవ్వకుండా ప్రజలు స్వచ్ఛందంగా పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాలలో ప్రజలు అందరూ కలిసిమెలిసి ఉండాలన్నదే తాము కోరుకుంటున్నామని వివరించారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర సాయుధ బలగాల వెంట ఎఎస్ఐ ఆంజనేలయు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

చెన్నూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు , సిఐ పార్థసారధి

రేపటి నుంచి గంగమ్మ జాతర

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

కొత్తపేట గంగమ్మ ఆలయం

మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ గంగమ్మ జాతర మహోత్సవం ఈ నెల 11న వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బుసిరెడ్డి పార్వతమ్మ గారి విశ్వనాథ రెడ్డి, కార్యనిర్వహణాధికారి (ఇఒ)పి.సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు శనివారం గంగమ్మ దేవాలయం వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ శ్రీ గంగమ్మ జాతర మహోత్సవాలు స్వస్తిశ్రీ శోభ కృత్ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పాడ్యమి 11 నుంచి మంగళవారం వరకు రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 11న నిండు తిరుణాల, 12న మైల తిరుణాల ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆలయ పూజారి రామచంద్రయ్య యాదవ్, పుల్లయ్య పాల్గొన్నారు.

పీస్ స్కూల్‌లో తేక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మరియాపురంలో వద్దనున్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్‌లో తేకాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీస్ స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొవాలని తెలిపారు. క్రీడల ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం కూడా పొందవచ్చు అన్నారు. టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభను చూపించడం అభినందనీయమన్నారు.. కిక్స్, కటాస్, హ్యాండ్ మూమెంట్, సెల్ఫ్ డిఫెన్స్, ఫైట్స్ టెస్ట్ కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులందరికీ మంచి ఫలితాలు అందుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తేక్వాండో జిల్లా సెక్రెటరీ మాస్టర్ ఎస్. కె. వసీం, పీస్ స్కూల్ కరాటే కోచ్ మన్సూర్ అహ్మద్ పాల్గొన్నారు.

శిక్షణలో విద్యార్థుల విన్యాసాలు

బాధ్యులెవరో?

ప్రజాదృష్టి

జిఎంసి పరిధిలోని కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవకతవకల కారకులను గుర్తించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. కడప, పులివెందుల జిఎంసి పరిధిలోని జిజిహెచ్, సూపర్‌స్పెషాలిటీ, మానసిక, కేన్సర్‌కేర్ విభాగాలకు చెందిన 196 పోస్టుల నోటిఫికేషన్ విడుదల దగ్గర నుంచి దరఖాస్తుల ఆహ్వానం, పోస్టుల భర్తీ ప్రక్రియలో అడుగడుగునా అలసత్వం కనిపించింది. పోస్టులకు తగిన అర్హతలను నిర్ణయించడంలోనూ గందరగోళమే నెలకొంది. కర్నూలు, గుంటూరు జిల్లాల్లో మెడిసిన్, న్యూక్లియర్ ఫిజిసిస్ట్ పోస్టులకు అర్హతలు గుర్తించడంలో పొరపాటును అంగీకరించ లేదు. రాష్ట్రంలోని రాజమండ్రి, తూర్పుగోదావరి ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు పీజీ చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించారని నోటిఫికేషన్, సెలెక్షన్ జాబితాలను చూపుతున్నప్పటికీ జిఎంసి యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం క్షమించరాని అంశం. జిల్లాలోని ఎనిమిది వేల మంది నిరుద్యోగుల ఆశలతో, జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదనే సంగతిని గ్రహించాలి. నిరుద్యోగులతో జిఎంసి అధికార యంత్రాంగం విచక్షణారహితంగా వ్యవహరించడం దారుణం. రిజర్వేషన్లకు అర్హులను నిర్ణయించడంలో తడబడటానికి గల కారకులెరో తేల్చాలి. ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యలో ఆరితేరిన అధికార యంత్రాంగం వాస్తవంగా అనుభవం లేక తప్పిదాలకు ఆస్కారమిచ్చిందా, లేక ఇతర ఒత్తిళ్లేమైనా ఉన్నాయా, ఒకవేళ ఒత్తిళ్లు ఉంటే బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేయాలి. ఇటువంటి ప్రయత్నం చేయకుండా నిరుద్యోగుల ఆశలతో చెలగాటమాడడం తగనిపని. ఫైనల్ లిస్టు ప్రకటనకు ముందుగా వందలాది దరఖాస్తులు కనిపించడం లేదని ప్రచారం సాగింది. అప్పుడైనా జిల్లా కలెక్టర్, జిజిహెచ్ బాధ్య కలెక్టర్ మేల్కొని ఉండాల్సి ఉంది. మీడియాలో కథనాలు వెల్లువెత్తడంతో డిప్యూటీ సిఎం.అంజాద్‌బాషా సీరియస్‌గా స్పందించడంతో రీవెర్ఫికేషన్ తెరపైకి వచ్చింది. లేనిపక్షంలో రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండానే సెలెక్షన్ లిస్టు ప్రకటించడమేమిటని కలెక్టర్ ప్రశ్నించి ఉండాలి. అప్రూవల్ ఫైలుపై సంతకం చేయడానికి నిరాకరించి ఉండాలి. డిప్యూటీ సిఎం సీరియస్‌గా స్పందించిన అనంతరం రీవెర్ఫికేషన్ పూనుకోవడం గమనార్హం. రీవెర్ఫికేషన్ పేరుతో ఆగమేఘాల మీద పండుగలు, సెలవులతో నిమిత్తం లేకుండా జిల్లాలోని పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో రీవెర్ఫికేషన్‌కు పూనుకోవడం పట్ల విమర్శలు ఉన్నాయి. మీడియా కథనాలకు అందని అక్రమాలు వెలుగులోకి వస్తే పరిస్థితేమిటని, వాటిని కూడా అడ్రెస్ చేయడానికి తగిన గడువును ఇచ్చి ఉంటే బాగుండేదనే సూచనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా బాధ్య కలెక్టర్లు కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవకతవకలకు కారకులను గుర్తించి, కింది స్థాయి ఉద్యోగులను బలి పశువులను చేయకుండా బాధ్యత కలిగిన ఉన్నతాధికారుల బాధ్యతా రాహిత్యాన్ని సైతం వెలుగులోకి తీసుకుని రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ఈద్గా ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరులో రూ.25.5 లక్షలతో నిర్మిస్తున్న ఈద్గా ప్రహరీ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిభూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ కంటే ముందుగానే ప్రహరీ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, ఖాజీపేట ఎంపిపి సిద్ధిక్, వైస్ చైర్మన్ షరీఫ్, భరత్‌రెడ్డి, అచ్చుకట్ల కరీముల్లా పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కిమ్స్ సవీర ఆసుపత్రి వారు కడప రహదారిలోని భారత్ పెట్రోలు బంక్ వద్ద ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శిబిరంలో జిఆర్‌బిఎస్, బిపి, ఇసిజి, 2డి ఎకో పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. గుండె, ఛాతి నొప్పి, దడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండెలో మంట, ఛాతిలో బరువుగా ఉండడం, నిద్రలో ఆయాసం వచ్చి లేచి కూర్చోవడం, కాళ్లవాపు, చెమట పట్టడం వంటి సమస్యలతో బాధపడేవారు సంప్రదించవచ్చన్నారు. మండలంలోని ప్రజలు, గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్న వారు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సభ్యులు కోరారు.

డాక్టర్ బాలనారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులు

ప్రజాశక్తి - ముద్దనూరు

పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గంగవరం బాల నారాయణరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక బాల నారాయణరెడ్డి ఆసుపత్రిలో ఆయన సతీమణి మాజీ సర్పంచ్ గంగవరం నాగ మల్లమ్మ, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా నాయీ బ్రాహ్మణ అధ్యక్షులు గురప్ప, మాజీ ఎంపిటిసి వరదారెడ్డి, వైసిపి యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి సుమంత్ యాదవ్, పలువురు ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

హుండీ ఆదాయం రూ.2.38 లక్షలు

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన ఆవరణలో శనివారం మహాశివరాత్రి ఉత్సవ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఇఒ శ్రీనివాసులు నిర్వహించారు. రూ.2.38 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కేవలం ఉత్సవానికి సంబంధించిన తాత్కాలిక ఆదాయం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జివై వెంకటసుబ్బారెడ్డి (ఉదయ్) సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మహిళలు

ఆదాయ వనరులను సమకూర్చుకోవాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

స్థానిక ఆంజనేయ పురంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక సాధికారతను సాధించవలసి ఉందన్నారు. జీవనోపాదులు పెంపొందించుకోవాలని తద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని సూచించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ డిఆర్‌డిఎ ఆంజనేయులు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ప్రతి మహిళ కష్టపడి పని చేయాలన్నారు. ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలంటే చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలు పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల సమాఖ్య తరపున ఉత్తమ సేవలు అందించిన కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ సుహాసిని, మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమణిని సన్మానించారు. మహిళలకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించి విజేతలకు ఎపిఎం ఆంజనేయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు రాజన్న, నాగేశ్వర్ రావ్ సుహాసిని, గ్రామసమైక్య అధ్యక్షురాళ్లు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, సెక్రటరీలు, మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కవిత, సరస్వతి డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పరిశోధనా పత్ర పోటీల్లో 'మిట్స్' ఉత్తమ ఫలితాలు

మదనపల్లి : కడపలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియంలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగంలో రెండవ సంవత్సరం ఆర్.జ్యోతి ప్రకాష్, మూడవ సంవత్సరం చదువుతున్న వి.మహేంద్ర పరిశోధన పత్ర పోటీలలో మొదటి బహుమతి పొందినట్లు మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. వీరు ప్రశంసపత్రం, షీల్డ్‌ను అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెట్ డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ కుసుమ , తదితరులు అభినందనలు తెలియజేశారు.

క్రైం కార్నర్

రూ.20 లక్షల నగదు పట్టివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని వై జంక్షన్ వద్ద ప్రొద్దుటూరుకు చెందిన మార్తల వెంకటరామిరెడ్డి వద్ద నుండి రూ.20 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం గదక్ నుండి ఎర్రగుంట్లకు రైలులో ప్రయాణం చేసి ప్రొద్దుటూరుకు వెళ్ళుటకు ఎర్రగుంట్ల బైపాస్ రోడ్‌లోని వై జంక్షన్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా అనుమానంతో అతని వద్దనున్న బ్యాగును తనిఖీ చేశామన్నారు. ఇందులో రూ.20 లక్షలు నగదు గుర్తించినట్లు తెలిపారు. నగలకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించినట్లు సిఐ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో కాంట్రాక్టు పనులు చేస్తున్నట్లు తెలిపాడని, బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేసి ఇన్కమ్ టాక్స్ అధికారులకు నగదును అప్పగించామని తెలిపారు.

రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్నవరం పంచాయతీ పరిధిలోని చెండ్లూరు గ్రామంలోని రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై గ్రామస్తులు శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని దొంగలు రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలోని హుండీని పగలగొట్టి అందులో ఉన్న దాదాపు రూ.30వేలను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాతపాలెంలో తాగునీటి తిప్పలు

పంటపొలాల్లో నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి

వ్యవసాయ పొలంలోని మోటర్ వద్ద నీటిని పట్టుకుంటున్న పాతపాలెం ప్రజలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పాతపాలెంలో ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. పది రోజుల క్రితం మోటర్ చెడిపోవడంతో నీరు పూర్తిగా సరఫరా కాలేదు. దీంతో గ్రామానికి చుట్టుపక్కల ఉన్న పంట పొలాల్లో మోటర్లు ఆడుతున్న సమయంలో నీటిని తెచ్చుకుంటూ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల నుంచి ఒత్తిడి అధికం కావడంతో మునిసిపాలిటీ అధికారులు రెండు రోజుల క్రితం బోరును సిద్ధం చేశారు. నీటి సరఫరాలో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. ఈ ఏడాది వర్షాభావంతో భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన మున్సిపాలిటీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు న్నాయి. తాగునీటి కోసం పాతపాలెం గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మైదుకూరు పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న గ్రామ పరిస్థితి ఈ విధంగా ఉంటే మారుమూల ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనవసరం లేదు. ఇంటి పన్ను, నీటి పన్ను సమయానికి వసూలు చేస్తూ ఏమాత్రం ఆలస్యమైనా వడ్డీలు వేస్తున్న మున్సిపాలిటీ అధికారులు ఇంటి అవసరాలకు కూడా నీటిని సరఫరా చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. మైదుకూరు మున్సిపాలిటీలోని కడప రోడ్డు, నంద్యాల రోడ్డులోని సీతారామాంజనేయ పురంలో కూడా పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రజల నుంచి వినతులు వచ్చిన సందర్భంలో మాత్రం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి కోసం పంట పొలాలకు వెళుతున్నాం..

ఇంటికి అవసరమైన నీటి కోసం పంట పొలాల బోర్ల వద్దకు వెళుతున్నాం. బిందెలతో ఎక్కువ దూరం నుంచి నీటిని తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. పది రోజుల నుంచి నీటి సమస్య అధికమైంది ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపడితే సమస్య ఉండదు.

- నారాయణమ్మ, పాతపాలెం

సమస్యను పరిష్కరించడంలో విఫలం..

తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉంది. పది రోజులుగా మోటర్ లేక నీరు రావడం లేదు. ప్రస్తుతం మోటరు ఏర్పాటు చేసి నప్పటికీ నీటి సరఫరా లేదు. తాగునీటి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలి.

- లలిత, పాతపాలెం

ఎట్టకేలకు సిపిడబ్ల్యుసి నుంచి నీటి సరఫరా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గానికి ప్రధాన తాగునీటి వనరైన పార్నపల్లె సిపిడబ్ల్యు స్కీం నుంచి నీటి సరఫరాను అధికారులు పునరుద్ధరణ చేశారు. గత నెల 5వ తేదీ నుంచి స్కీం పంప్ హౌస్ వద్ద భారీ మోటర్లు ఏర్పాటుకు నీటి సరఫరాను నిలిపివేసిన విషయం తెలిసిందే. నీటి సరఫరా నిలిచిపోవడంతో నియోజకవర్గంలోని పులివెందుల అర్బన్, సింహాద్రిపురం, లింగాల మండలాలలోని 39 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయింది. ఆయా గ్రామాల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. సమస్యను గత నెల 27న 'ప్రజాశక్తి' దినపత్రిక 'సిపిడబ్ల్యు స్కీం నీటి సరఫరా నిలిపివేత' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకొని యుద్ధ ప్రాతిపదికగా పనులు పూర్తి చేసి పునరుద్ధరణ చేశారు. స్కీం పరిధిలోని గ్రామాలకు నీటి సరఫరా పునరుద్ధరణ కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయి నీటి సరఫరాకు చర్యలు..

పార్లపల్లె సిపిడబ్ల్యు స్కీం పరిధిలోని పూర్తిస్థాయి గ్రామాలకు నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. పంపు హౌస్ వద్ద మరమ్మతులు కారణంగా నీటి సరఫరా విలిపివేసినా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరా చేశాం. సిపిడబ్ల్యు స్కీం నుంచి నీటి సరఫరా పునరుద్ధరణ చేశాం.

- విజయ్‌భాస్కర్, ఇఇ, ఆర్‌డబ్ల్యుఎస్, పులివెందుల

పంపుహౌస్ వద్ద భారీ మోటర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

గ్యాస్ ధర తగ్గింపు ఎన్నికల స్టంట్ : పిసిసి

విలేకరులతో మాట్లాడుతున్న ఎన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.100 తగ్గించడం బిజెపి ఎన్నికల స్టంట్ అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వంట గ్యాస్ ధర బెత్తడు తగ్గించడం, ఎన్నికలు అయిపోయిన వెంటనే బారెడు పెంచడం మోడీ ప్రభుత్వానికి బాగా అలవాటైందని విమర్శించారు. ఇది మోడీ కనికట్టు అన్నారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 140 డాలర్లు ఉండేదన్నారు. అయినా లీటరు డీజల్ రూ.50, పెట్రోలు రూ.70, వంట గ్యాస్ సిలిండర్ రూ.410కే సరఫరా చేశారన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లుగా ఉందన్నారు. అయినప్పటికి లీటర్ పెట్రోల్ రూ.110, డీజిల్ రూ.100, వంట గ్యాస్ ధర రూ.900 ఉండడం గర్హనీయమన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే వంట గ్యాస్ సిలిండర్ రూ.500కే సరఫరా చేస్తుందని చెప్పారు. బిజెపితో టిడిపి, జనసేన ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోవడం, వైసిపి బిజెపి ప్రాపకం కోసం పాకులాడడం సిగ్గు చేటు అన్నారు. విలేకరుల సమావేశంలో ధృవకుమార్‌రెడ్డి, రామకృష్ణ, నరసింహారెడ్డి, ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు.

సంకల్పమే విద్యార్థులకు గొప్ప ఆయుధం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఏదైనా సాధించడానికి సంకల్పానికి మించిన ఆయుధం మరొకటి విద్యార్థులకు లేదని కర్నూలు సిఐ శేషయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలాజీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శేషయ్య మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట ఇదే పాఠశాలలో తాను పదవ తరగతి పూర్తి చేశానని తెలిపారు. లక్ష్యంతో చదివి జీవితంలో పైకి రావాలని సిఐ ఆకాంక్షించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చేలా చదవాలని కోరారు. పాఠశాల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. విలువలతో కూడిన జీవితం సాగించేందుకు పాఠశాల విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు సూర్యమిత్ర, సీనియర్ ఉపాధ్యాయులు ఎఐ ప్రసాద్‌రెడ్డి, ఖాసీం, భరత్, బాషా, హృషీ, హేమలత ప్రసంగించారు. డైరెక్టర్ బి.రవీంద్రారెడ్డి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావుకు పాఠశాల తరుపున రూ.10,000 నగదును వితరణ చేశారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్నూలు సిఐ శేషయ్య

బండలాగుడు పోటీల్లో అనంతపురం ఎడ్లు ఫస్ట్

పోటీలను ప్రారంభిస్తున్న పివి రమణారెడ్డి, మొదటి బహుమతి అందజేస్తున్న చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీలలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె రమేష్ ఎడ్లు 1680 అడుగులు లాగి మెదటి స్థానంలో నిలిచాయి. బండలాగుడు పోటీలను ఎంపిపి టి లక్షుమయ్య, కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండీ పివి రమణారెడ్డి, చైర్మన్ జివై వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 10జతల ఎడ్లు బండలాగుడు పోటీలో పాల్గొన్నాయి. వల్లూరు మండలం బాలయగారిపల్లెకు చెందిన రమణారెడ్డి ఎడ్లు 1585 అడుగులు లాగి రెండవ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పిఆర్ పల్లె ఎం నాగయ్య ఎడ్లు 1468 అడుగులు లాగి మూడవ స్థానంలో, ప్రొద్దుటూరు మండలం మార్తల చంద్రఓబులరెడ్డి ఎడ్లు 1452 అడుగులు లాగి నాల్గవ బహుమతి, యాడికి జి చెన్నప్ప ఎడ్లు 1354 అడుగులు లాగి ఐదో బహుమతి, ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీ ద్వార్శల గురివిరెడ్డి ఎడ్లు 1251అడుగులు లాగి ఆరవ బహుమతి, ఎం రమేష్ ఎడ్లు 1205 అడుగులు లాగి ఏడో బహుమతి కైవసం చేసుకున్నాయి. మొదటి స్థానంలో నిలిచిన ఎద్దులకు కమలాపురం మండలం కుప్పూరువారిపల్లెకు చెందిన కె లక్ష్మణరెడ్డి రూ.1,00116 బహుమతిగా అందజేశారు. రెండవ బహుమతిని లక్ష్మీపేట కర్నాటి నారాయణరెడ్డి రూ.70 116, మూడవ బహుమతి అల్లాడుపల్లె రజకుల సంఘం, చెన్నూరు జ్యువెలర్స్ వారు సంయుక్తంగా రూ.60,116, నాలుగో బహుమతిని చియ్యపాడు గ్రామానికి చెందిన కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండి పివి రమణారెడ్డి రూ.40,116, 5వ బహుమతి బ్రహ్మంగారిమఠం వి రవింద్రనాథ్ రెడ్డి రూ.20,116, 6వ బహుమతి ని నరహరిపురం గ్రామానికి చెందిన పి.చిన్న వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.12.116, 7వ బహుమతిని కోడూరు వెంకటేష్ కుటుంబ సభ్యులు రూ.5,116 అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.కిషోర్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు వేమారెడ్డి, నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బిజెపి ప్రలోభాలను ప్రజలు విశ్వసించరు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూల భాస్కర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నికల ముందు వంట గ్యాస్ ధర తగ్గించినంత మాత్రాన, ప్రలోభాలు పెట్టినంత మాత్రాన బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించరని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూల భాస్కర్ తెలియ జేశారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రత్యేక హోదా ప్యాకేజీపై ప్రశ్నించిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేడు బిజెపికి దాసోహమైందన్నారు.

ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు సైతం రాష్ట్రాభివృద్ధిని మరచి బిజెపితో పొత్తు కోసం తహతహలాడుతున్నాయని, కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రజా సమస్యలపై బిజెపిని నిలదీస్తుందని, రానున్న ఎన్నికలలో బిజెపితో పాటు, ఆ పార్టీకి అనుబంధమైన పార్టీలను కూకటి వేళ్లతో సహా పెకలిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయని తద్వారా నిరుద్యోగ సమస్యను నిర్మూలిం చగలుగుతామన్నారు.

ఇంటింటి ప్రచారంలో పుట్టా సుధాకర్ యాదవ్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకుంటేనే సాధ్యమవుతుందని మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రజలందరూ టిడిపికే పట్టం కట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, మండల సీనియర్ నేత సందుల నాగశివారెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, ఖాదీరుల్లా, జలీల్ అహ్మద్, కె.కె బ్రదర్స్, అర్షద్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, చిన్న, జనసేన మైదుకూరు ఇన్‌ఛార్జి మల్హోత్రా, పత్తూరు ఉప సర్పంచ్ రమణ, హరినాథ్‌రెడ్డి, భూమాయపల్లె సర్పంచ్ కొంగాని వెంకట సుబ్బయ్య, పిచ్చి నాయుడు, సరిటాల వీరయ్య, కరెంటు వెంకటయ్య, ఐ టీడీపీ మండలం అధ్యక్షులు పాపన మల్లికార్జునరెడ్డి, జానకి రామ్‌నాయుడు, మామిళ్ళ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జై హిందుస్థాన్ పార్టీ నాయకులు

జై హిందుస్థాన్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని పాత జూనియర్ కాలేజి సమీపంలో పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి జై హిందుస్థాన్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు తుమ్మల ఓంకార్, రాష్ట్ర అధ్యక్షులు వంగల గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నరేష్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు అండగా తమ పార్టీ ఉంటుందన్నారు. అయిదేళ్లుగా రాష్ట్రంలో వందలాది ఆలయాలు పడగొడుతున్నారని, దీనికి ప్రతిఫలంగా ఈ ప్రభుత్వాన్ని మనందరం కలిసి పడగొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, పులివెందుల పట్టణ అధ్యక్షులు, గంగాధర పాల్గొన్నారు

వైసిపి జిల్లా యువజన కార్యదర్శిగా కొమ్ము రఘురాముడు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి జిల్లా యువజన కార్యదర్శిగా ఎర్రగుంట్ల సుందరయ్య నగర్‌కు చెందిన కొమ్ము రఘురాముడు నియమితులయ్యారు. ఆ మేరకు జిల్లా కార్యాలయం నుండి శనివారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవకు గుర్తింపుగా అధిష్టానం పదవిని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ గెలుపు కోసం తన వంతు పూర్తి సహకారాన్ని అందించి, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. పదవి రావడానికి కారణమైన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సురేష్ బాబుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

వైవీయూ పరీక్షలో కె.సుజిత ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - మైదుకూరు

యోగివేమన విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో పదికి పది పాయింట్లు సాధించి యూనివర్సిటీ ప్రథమ ర్యాంకు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తమ కళాశాలకు చెందిన బీఎస్సీ బాటనీ హానర్స్ మొదటి సెమిస్టర్‌కు చెందిన కె.సుజిత పదికి పది గ్రేడ్ సాధించి యూనివర్సిటీ ప్రథమ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. పి.బేబీ 9 పాయింట్లు, బి.నాగశృతి 8.5, బీకాంకు చెందిన విద్యార్థులు టివిమహేశ్వరి, ఎస్వీ.వీరభద్ర 8.5 పాయింట్లతో మంచి ప్రతిభ కనబరిచారన్నారు. విద్యార్థులు సాధించిన మంచి ఫలితాలు కళాశాల కీర్తిని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులను, అధ్యాప కులను ప్రిన్సిపల్ అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు డాక్టర్ పివి కృష్ణారెడ్డి, డాక్టర్ నరసింహారావు, అయ్యవారిరెడ్డి, రాధారామ్, నవనీశ్వర్‌రెడ్డి, చెన్నరాయుడు, అనురాధ లక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో సత్తా చాటిన 'వేదవ్యాస'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

పట్టణంలోని వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు సెమిస్టర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఆరు మంది విద్యార్థులు 10కి 10 జిపిఎ సాధించి భేష్ అనిపించుకున్నారు. మెదటి సెమిస్టర్ బిఎస్సీ (కంప్యూటర్‌సైన్స్) విభాగంలో బి.ప్రణీత, జి.గౌస్‌బీ, కె.ఆదిత్యవర్ధన్, ఎస్.సాజిద్‌హుసేన్, వి.మన్విత‌రెడ్డి, కె.యస్.సాజిదారెహెమాని 10కి10 జిపిఎ సాధించినట్లు కళాశాల కరెస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. బి.కాం విభాగంలో సోనియా 9.5, మూడో సెమిస్టర్ ఎంపిసిఎస్ విభాగంలో నాగసుష్మిత 9.51, యం.మీనా 9.32, రాంద్‌బీ 9.12, యంఎస్‌సియస్ విభాగంలో కె.అనూష 8.90, జ్యోతి స్వరూప్ 8.84, బికాం విభాగంలో అతిఫాబాను 8.83, వినీత 8.64, ఐదో సెమిస్టర్ యంపిసియస్ విభాగంలో మౌనిక 9.11, లలిత 9.04, యంయస్‌సియస్ విభాగంలో చంద్రిక 9.14, శ్రీదీక్షిత 8.74, బీకాం విభాగంలో శ్రీదేవి 8.62, ధరణి 8.50 జిపిఎ సాధించారన్నారు. కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, కళాశాల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి అభినందించారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రక్తదానం ప్రాణదానంతో సమానమని మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లక్షణ్‌మోరె అన్నారు. పుల్లమ్మ (85)కు చేయివిరగడంతో స్థానిక సాయిశ్రీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు బి పాజిటిక్ రక్తం అవసరం కాగా, ఫౌండేషన్‌ను బాధితులు శనివారం ఆయనను సంప్రదించారు. వెంటనే స్పందించి ఫౌండేషన్ సభ్యుడైన అల్తాఫ్ ద్వారా సురక్ష బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా లక్షణ్‌రావు మాట్లాడుతూ రక్తదానం చేసి ఆదుకున్న మనిషి జీవితానికి అర్థం ఉంటుందన్నారు. రక్తదానం చేయుటలో ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రెజరర్ భాస్కర్‌సాయి, టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ పాల్గొన్నారు.